క్లుప్తంగా

ఓటర్ల జాబితా సరిచూసుకోవాలి



రాజకీయపార్టీ నేతలతో సమావేశమైన తహసీల్దార్ అరుణకుమారి

గజపతినగరం: గ్రామాల వారీగా ఓటర్ల జాబితాను సరిచూసుకోవాలని రాజకీయ పార్టీల నాయకులకు తహసీల్దార్ ఎం.అరుణకుమారి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ రాజకీయపార్టీల నేతలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారితో ఓటు హక్కుకి దరఖాస్తు చేయించాలని చెప్పారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు,తొలగింపులు ఉంటే సరి చూసుకోవాలని సూచించారు. ఎలక్షన్ డీటీ సతీష్ కుమార్, వైఎస్సార్ సీపీ, టీడీపీ,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం చల్లపేట ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం7 గంటల నుంచి 8.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. గజపతి నగరం, గంగచోళ్లపెంట, పత్రువాడ, బంగారమ్మపేట, సాలిపేట, కొనిశ, దావాలపేట, బూడిపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులతో యోగా చేయిస్తున్న ఆర్యసమాజం ప్రతినిధి

చీపురుపల్లి: నిత్యం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, చిన్నతనం నుంచే యోగా సాధన చేయాలని ఆర్య సమాజం ప్రతినిధి కుమరపు అప్పలనాయుడు విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యోగాపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రతీ ఒక్కరి జీవితాల్లో నిత్యకృత్యంగా మారాలన్నారు. మారిన ఆహారపు అలవాట్లు, ఉద్యోగ, విధి నిర్వహణల్లో ఒత్తిడికి లోనవుతూ చాలా మంది ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారందరికీ యోగా దివ్య ఔషధం అన్నారు. పాఠశాల హెచ్ఎం ఎస్.బలరాం, ఉపాధ్యాయులు వలిరెడ్డి రవీంద్రనాయుడు, ధనలక్ష్మి, జానకీరామయ్య పాల్గొన్నారు.

గొడౌన్ నిర్మాణం పరిశీలన



గొడౌన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

దత్తిరాజేరు: మండలంలోని పోరలి వద్ద ఉద్యానవన పంటల నిల్వ కోసం ఉద్యానవన శాఖ నిధులు రూ.15 లక్షలతో నిర్మిస్తున్న గొడౌన్‌ను ఆ శాఖ ఏడీ శైలజ, యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్ బుధవారం పరిశీలించారు. నవంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని గుత్తేదారును వారు ఆదేశించారు.గొడౌన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని ఉద్యానవన రైతులు తాము సాగుచేసే పంటలను ఇక్కడ నిల్వచేసుకోవచ్చని అధికారులు చెప్పారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జామి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమా వేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.సతీష్ బుధ వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించను న్న ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



లింగంపేటలో విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

లక్కవరపుకోట: విత్తన శుద్ధి చేయడం వల్ల ఏ పంటలో అయినా కొన్ని రకాల తెగుళ్లను ముందుగానే నివారించవచ్చని సబల సంస్థ ప్రతినిధి కె.ఈశ్వరరావు అన్నారు.మండలంలోని లింగంపేట క్లస్టర్ పరిధిలో లింగంపేట, మార్లాపల్లి, చందులూరు, భూమిరెడ్డిపాలెం, లచ్చింపేట, కిత్తన్నపేట, రేగ, సంతపేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులతో బుధవారం సామూహిక వరి విత్తన శుద్ధి చేయించారు. బీజామృతంతో వరి విత్తన శుద్ధి చేయడం వల్ల పొడతెగులు,అగ్గితెగులు, కాండం తొలుచు పురుగులను నివారించవచ్చన్నారు. సచివాలయాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ఇంటింటా ఆనందం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు కడుబండి, అప్పలనరసయ్య



లక్కవరపుకోట: మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



గంట్యాడ: మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ఇంటింటా ఆనందం నెలకొందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మార్లాపల్లి సచివాలయం పరిధి లింగంపేట గ్రామంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించి, పథకాల అమలు తీరుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు గండి పైడిరాజు, నందిపల్లి శ్రీరామ్మూర్తి, లెక్కల వీర బాబు, పినిశెట్టి కిష్టప్పదొర, యడ్ల కిశోర్,పెదిరెడ్ల వెంకటేష్, బోకం అప్పారావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలి

గంట్యాడ: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో ఆయన్ను ఆశీర్వదించాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. మండలంలోని చినమధుపాడ గ్రామంలో బుధవారం 'గడపగడపకు మనప్రభు త్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్యరంగానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఎలాంటి వ్యాధికైనా ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొంద వచ్చని చెప్పారు. చికిత్స అనంతరం ఆరోగ్య ఆసరా కింద భృతిని అందిస్తున్నామని తెలిపారు. టీడీపీ నాయకులు ,ఆ పార్టీ సానుభూతిపరులకు సైతం పథకాలు అందిస్తున్నామని చెప్పారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ గొర్లె చిన్నమ్మ, నాయకులు నారాయణమూర్తిరాజు, లచ్చిరెడ్డి కృష్ణ, పి.నారాయణమూర్తి, రామసూర్యం, కోడెల ముత్యాల నాయుడు, పలుశాఖల అధికారులు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ప్రతీఒక్కరి ఆరోగ్య వివరాలు



జామి పీహెచ్‌సీలో మందుల నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

జామి: వైద్యం కోసం పీహెచ్‌సీకి వచ్చిన ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు వైద్యసిబ్బందికి సూచించారు. జామి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, భీమసింగి హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం సందర్శించారు. రికార్డులు, మందుల నిల్వలను, పీహెచ్‌సీలో నాడు–నేడులో భాగంగా నిర్మించిన నూతన భవనాన్ని పరిశీలించారు. జిల్లా ఎపిడిమియాలజిస్ట్ వెంకటేష్, స్థానిక వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి,హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్, సీహెచ్ఓ ఫ్లారెన్స్, హెచ్‌వీ భవాని తదితరులు పాల్గొన్నారు.

8న వైఎస్సార్ జయంతి వేడుకలు

- 9న మంత్రి బొత్స పుట్టిన రోజు
- సేవా కార్యక్రమాలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: మహానేత దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జయంతి రోజున మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఈనెల 9న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజును పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మెగారక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణతో పాటు మండలంలో వెయ్యి మంది పేదలకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్ధనరావు, పార్టీ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, చందక గురునాయుడు, బెల్లాన త్రినాథరావు, కోరుకొండ దాలయ్య, మీసాల రమణ, గొర్లె రమణ, కరణపు ఆది పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జ్ఞానదీపిక

గజపతినగరం: సచివాలయ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని, గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ జూనియర్ లైన్‌మన్‌లు, ఏఎన్ఎంలతో బుధవారం ఆమె సమావేశమ య్యారు. జూనియర్ లైన్‌మన్‌లు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఏఎన్ఎంలు ప్రజలకు వైద్యసేవలు అందించడమే కాకుండా, వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంపీడీఓ కిశోర్‌కుమార్, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామి వారు

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వరప్రసాద్ సీతారామాచార్యుల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారికి భక్తులతో పంచామృతాభిషేకాలు చేయించారు. అనంతరం ప్రసాదవితరణ చేశారు.

తూనిక యంత్రాలకు సీళ్లు తప్పనిసరి



తూనిక యంత్రానికి సీల్ వేస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు

బొండపల్లి: వ్యాపారులు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలకు తప్పనిసరిగా సకాలంలో సీళ్లు వేయించుకోవాలని విజయనగరం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదరనాయుడు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల వ్యాపారులకు చెందిన 120 ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలకు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం సీళ్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వ్యాపారాల్లో వినియోగించే తూనిక యంత్రాలను ప్రతీ ఏడాది లీగల్ మెట్రాలజీ అధికారులతో పరీక్షలు చేయించుకుని సీళ్లు వేయించుకోవాలని చెప్పారు. మండలంలోని పలువురు వ్యాపారులకు తమ ఎలక్ట్రానిక్ యంత్రాలతో బొండపల్లిలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో హాజరు కావాలని ముందుగానే నోటీసులు జారీ చేశామని చెప్పారు. యంత్రాలకు సీళ్లు వేసి సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. సీళ్లు లేని యంత్రాలను వినియోగిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులు, తల్లులకు అమ్మ ఒడి నమూనా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని భావించి పేద పిల్లల చదువుల కోసం ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మోడల్ స్కూల్‌లో మండల స్థాయి జగనన్న అమ్మఒడి సంబరాలను బుధవారం నిర్వహించా రు. విద్యార్థుల తల్లులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో కలిసి అమ్మ ఒడి నిధులకు సంబంధించిన నమూనా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంపై గత నాలుగేళ్లలో రూ.66,722 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. మన బడి నాడు–నేడు పథకంలో భాగం పాఠశాలల రూపురేఖలు మార్చారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం విద్యారంగాన్ని కార్పొరేట్ రంగానికి హస్తగతం చేసిందని విమర్శించారు.సీఎం జగన్ విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని అన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట సత్కరించి , నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని 5 మండలాల్లో 22,518 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈఏడాది అమ్మ ఒడికి సంబంధించి రూ.33.77 కోట్లు జమచేసినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో విద్యావ్యవస్థ బలోపేతమైందన్నారు. ఎంఈఓలు సీహెచ్.కూర్మారావు, శ్రీనివాసరావు, తహసీల్దార్ జి.ఆదిబాబు, ఎంపీడీఓ జ్ఞానేశ్వరరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, నాయకులు పినిశెట్టి కిష్టప్పదొర, యడ్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



వృద్ధురాలితో బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ పావని

గుర్ల: మండలంలోని గరికివలస గ్రామానికి చెందిన మండల బంగారమ్మ అనారోగ్యంతో విశాఖపట్నం లోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆమెకు జూలై నెలకు సంబంధించిన వృద్ధాప్య పింఛన్ డబ్బులను వలంటీర్ కోరాడ పావని బుధవారం విశాఖపట్నం వెళ్లి అందజేసింది. వలంటీర్‌కు వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తంగా...

నేడు పెంపుడు జంతువులకు టీకాలు

చీపురుపల్లి: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు జంతువులకు గురువారం ఉచితంగా టీకాల వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ ఆర్.శారద బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9.30 గంటల నుంచి పట్టణంలోని పశువైద్యశాల ఆవరణలో టీకాలు వేస్తామని పేర్కొన్నారు. పెంపుడు కుక్కలను ప్రాణాంతక రే బిస్ వ్యాధి నుంచి రక్షించుకునేందుకు వ్యాక్సిన్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

7న మండల సర్వసభ్య సమావేశం

చీపురుపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అధ్యక్షతన ఈనెల 7న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు బుధవారం ఓ ప్రకట నలో తెలిపారు.ఉదయం10.30గంటలకు ప్రారంభమయ్యే ఈసమావేశానికి మండల అధికారులు,సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

నేడు కన్వర్జెన్సీ సమావేశం

బొండపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో గురువారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వ హించనున్నట్టు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపా రు. సమావేశానికి మండల అధికారులు అంతా త మ శాఖల ప్రగతి, సమస్యలకు సంబంధించి పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

బంద్‌తో పాఠశాలల మూసివేత

చీపురుపల్లి: ప్రైవేటు పాఠశాలల దోపిడీని నిరసిస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పాఠశాలల బంద్‌కు పిలుపు ఇచ్చింది. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు ముందుగానే సెలవు ప్రకటించాయి.ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంపత్ కుమార్ నేతృత్వంలో ఏబీవీపీ శ్రేణులు బుధవారం ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను తరగతిగదుల నుంచి బయిటకు పంపించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ పాఠశాలల్లో ఏకరూప దుస్తులు, పుస్తకాల పేరుతో జరుగుతున్న దోపిడీను అరికట్టాలన్నారు. టెక్నో, ఈ–టెక్నో, స్మార్ట్, ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ వంటి బ్రాండ్ల పేరుతో అధిక ఫీజుల దోపిడీని నియంత్రించాలని కోరారు.

8,9వ తేదీల్లో శిక్షణ

జామి: సమరసత సేవా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలపై ఫౌండేషన్ డివిజన్ స్థాయి సభ్యులకు రాజమండ్రిలో ఈనెల 8,9 తేదీల్లో శిక్షణ ఉంటుందని సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ సీహెచ్.నర్సింగరావు తెలిపారు. బలరాంపురం గ్రా మంలోని ఉమామహేశ్వర ఆలయంలో సమరసత సేవా ఫౌండేసన్ మండల కన్వీనర్ మట్టా జనార్దన్ ఆధ్వర్యంలో సభ్యులతో బుధవారం స మావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఆ ఫౌండేషన్ మండల కమిటీ సభ్యులు ఏ.కృష్ణ, సాంబమూర్తి,తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులు కళాశాలలో చేరవచ్చు

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుని ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులను మళ్లీ తమ కళాశాలలో చేర్చుకుంటున్న ప్రిన్సిపాల్ అప్పారావు బుధవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్టూడెంట్ ఇన్ఫో డేటాను అనుసరించి పరీక్షలు తప్పిన విద్యార్థులను కళాశాలలో చేర్చుకుంటున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ సబ్జెక్టుల్లో విద్యార్థులు తప్పారో ఆ సబ్జెక్టు క్లాసులకు విద్యార్థులు హాజరు కావచ్చన్నారు.అలాగే 10వతగతి పాస్ అయి ఖాళీగా ఉన్న వారు, ఐటీఐ, డిప్లమో కోర్సులు చదివినవారు ఇంటర్‌లో జాయిన్ అవ్వవచ్చని అన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.


ఎం.వెంకటాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సుష్మా

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం–2 పరిధి ఎం.వెంకటాపురం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మా ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరంలో 104 మందికి వివిధ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్యతనిఖీలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శివాని, ఏఎన్ఎం బేగమ్, ఆశ కార్యకర్త పైడిరాజు పాల్గొన్నారు.

ధర్నా



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

కొత్తవలస: పరిశ్రమలకు సంబంధించిన విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదని సీఐటీయూ నాయకుడు తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. సీఐటీ యూ ఆధ్వర్యంలో కొత్తవలస మూడురోడ్ల జంక్షన్‌లో బుధవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విద్యుత్ చార్జీల పెంపు వల్ల పలు పరిశ్రమలు మూతపడ్డాయని, దీంతో ఎంతో మంది కార్మికులు వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చే శారు. ప్రస్తుతం పరిశ్రమలకు పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

'జగనన్న సురక్ష'తో ప్రజల వద్దకే ఉచిత సేవలు



చీపురుపల్లి రూరల్(గరివిడి): ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



వేపాడ: దబ్బిరాజుపేటలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్



దత్తిరాజేరు: పాచలవలసలో ప్రజలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీసింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రాజేశ్వరి



బొండపల్లి: గొల్లుపాలెంలో మాట్లాడుతున్న మండల జేసీఎస్ ఇన్‌చార్జి రఘు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, పథకాలు, ప్రభుత్వసేవలు 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజల ముంగిటకే ఉచితంగా అందుతున్నాయని జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు అన్నారు. గరివిడి మండలంలోని వెదుళ్లవలస, కొండదాడి గ్రామాల్లో బుధవారం 'జగనన్న సురక్ష' క్యాంపులు ఏర్పాటు చేశారు. పలువురికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామా ల్లోనే ప్రభుత్వసేవలన్నీ అందుతున్నాయని అన్నారు. అలాగే ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందించేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి పొన్నాడ కుమార్, సర్పంచ్‌లు గుడివాడ తమ్మినాయుడు, నారాయణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న సురక్ష' సర్వే

బొండపల్లి: 'జగనన్న సురక్ష' సర్వేను పక్కాగా చేపట్టాలని మండల జేసీఎస్ ఇన్‌చార్జి పల్లి రఘు సూచించారు. మండలంలోని గొల్లుపాలెం గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు, గృహ సారథులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని ఇంటింటికీ వెళ్లి 'జగనన్న సురక్ష'లో భాగంగా అందించనున్న 11 రకాల ధ్రువపత్రాలపై అవగాహన కల్పించి, అవసరమైన వారితో దరఖాస్తు చేయించాలన్నారు. ఎంఎల్ఓ జి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన

దత్తిరాజేరు: రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతోందని, ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవ లు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అన్నారు. మండలంలోని గడసాం,పాచలవలస సచివాలయంలో బుధవారం 'జగనన్న సురక్ష' క్యాంపు నిర్వహించారు. 280 మందికి ఫ్యామిలీ మెంబర్, కౌలు రైతు కార్డులు, కుల, ఆధాయ, తదితర ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశారు. వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, సర్పంచ్ సుమల శ్యామల, ఎంపీటీసీ అలజంగి అప్పలనాయుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ గురుమూర్తి, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నేతేటి వెంకటరమణ, బూడి గణపతి, మజ్జి అప్పలనాయుడు, సుమల గోవింద్, పాలూరి అప్పారావు, కొత్తల తాడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లాలి

వేపాడ: 'జగనన్న సురక్ష' సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వెళ్లి ప్రజల సమస్యలను, వారికి అవసరమై న ధ్రువపత్రాల కోసం వివరాలను నమోదు చేయాలని ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ సూచించారు. మండలంలోని దబ్బిరాజు పేట గ్రామసచివాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి 'జగనన్న సురక్ష' సర్వేపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించి ప్రజల సమస్యల ను తెలుసుకుని పరిష్కరించాల్సి ఉందని చెప్పారు.